
సాక్షి
రంగారెడ్డి

శుక్రవారం । 3 । మార్చి । 2023



నేటినుంచి కల్యాణ మహోత్సవాలు

మంఖాల్‌లో కొలువుదీరిన ఆదిలక్ష్మి, అలివేలుమంగ సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం తిరు కల్యాణ మహోత్సవానికి సిద్ధమైంది. 8లో▸

బండ్లగూడ, పోచారం ఫ్లాట్‌లకు లాటరీ నేడు

నాగోల్ బండ్లగూడ, పోచారంలో మిగిలిన రాజీవ్ స్వగృహ ఫ్లాట్‌లకు శుక్రవారం మరోసారి లాటరీ నిర్వహించనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. ఇప్పటికే ట్రిపుల్ బెడ్రూంకు రూ.3 లక్షలు, డబుల్ బెడ్రూంకు రూ.2 లక్షలు, సింగిల్ బెడ్రూంకు రూ.లక్ష చొప్పున టోకెన్ చెల్లించిన వారు లాటరీలో పాల్గొనవచ్చు. శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి లాటరీ నిర్వహించనున్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

తుక్కుగూడ: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (టీఎన్‌జీఓ) 2023 నూతన డైరీ, క్యాలెండర్‌ను గురువారం నగరంలోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ మాట్లాడుతూ.. రంగారెడ్డి కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఉద్యోగులందరికీ 24 శాతం హెచ్‌ఆర్‌ఏ ఉత్తర్వులు, హెల్త్ కార్డులు అందుతాయన్నారు. త్వరలో పీఆర్‌సీపై ప్రభుత్వం నుంచి ప్రకటన వస్తుందన్నారు.

న్యూస్‌రీల్

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్తయ్య



ఆర్.కృష్ణయ్య నుంచి నియామకపత్రం అందుకుంటున్న సత్తయ్యకురుమ

కందుకూరు: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కందుకూరుకు చెందిన ఎగ్గిడి సత్తయ్యకురుమ నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించినందుకు కృష్ణయ్యకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బీసీల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్‌కృష్ణ, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, నీలం వెంకటేశ్, ఇంద్రకంటి రవీందర్‌గౌడ్, గొరిగె పాండుకురుమ, బండ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి

షాద్‌నగర్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి వైద్య సిబ్బందికి సూచించారు. షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఫరూఖ్‌నగర్ హరిజనవాడలో గురువారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరానికి వచ్చే వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించారు.. రికార్డుల నిర్వహణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి శిబిరాలకు తరలించే బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఆప్తమాలజిస్టు తుకారాం, డీఈఓలు భారతి, అశ్విని, ఏఎన్‌ఎం స్వప్న, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో కారు బీభత్సం

- మూడు కార్లు, పది బైకులు ధ్వంసం
- గాయాలతో బయటపడ్డ కారులోని వ్యక్తి
- తప్పిన ప్రాణ నష్టం

చేవెళ్ల: ఓ కారు బీభత్సం సృష్టించింది. మూడు కార్లు, పది బైకులను ధ్వంసం చేసింది. తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మల్కాపూర్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం తన కారులో మల్కాపూర్ నుంచి చేవెళ్లకు వస్తున్నాడు. మండలకేంద్రంలోని జర్నలిస్టుకాలనీలోకి రాగానే ఒక్కసారిగా అదుపు తప్పి ఇళ్ల ముందున్న ర్యాంపులు, పార్కు చేసిన బైకులు, స్కూటీలు, ప్రహరీలను ఢీకొంటూ వెళ్లింది. చివరికి పల్టీలు కొడుతూ వెళ్లి బోల్తాపడింది. కారులో ఉన్న రాజశేఖర్‌రెడ్డి చేయి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని స్థానికులు బయటికి తీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కారు నడిపిన రాజశేఖర్‌కు మూర్ఛ వ్యాధి ఉందని కారు నడుపుతున్న సమయంలో మూర్ఛ వచ్చి ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ధ్వంసమైన వాహన యజమానులు, ఇళ్ల యజమానుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బీభత్సం సృష్టించిన కారు ఇదే..

అచ్చేదిన్ పోయి.. సచ్చేదిన్ వచ్చె..

- కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక అన్నీ కష్టాలే
- గ్యాస్, నిత్యావసర, ఇంధన ధరలు ఇష్టారీతిన పెంపు
- కమలం పువ్వు గుర్తుకు ఓటేస్తే మళ్లీ కట్టెలపొయ్యే..
- గ్యాస్ ధరల పెంపుపై నిర్వహించిన నిరసన ర్యాలీలో మంత్రి సబితారెడ్డి



గ్యాస్ ధరల పెంపుపై మీర్‌పేటలో నిరసన ర్యాలీ



కట్టెల మోపును తలపై పెట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

మీర్‌పేట: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అచ్చేదిన్ పోయి.. సచ్చేదిన్ వచ్చాయని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఎద్దేవా చేశారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనపు పెంపును నిరసిస్తూ గురువారం జిల్లెలగూడ చందన చెరువు కట్ట నుంచి మీర్‌పేట కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో వితంతు, దివ్యాంగుల,వృద్ధాప్య పింఛన్లు, కల్యాణలక్ష్మి, రైతు బంధు, రైతుబీమా వంటి పథకాలతో ప్రజలకు మేలు చేస్తుంటే.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గ్యాస్, నిత్యావసర,ఇంధన ధరలు పెంచుతూ జేబులు ఖాళీ చేస్తోందని మండిపడ్డారు. ఎనిమిదిన్నరేళ్లుగా ఏటా గ్యాస్ ధరలు పెంచుతూ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీకి వచ్చే ఎన్నికల్లో ఆడబిడ్డలంతా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇటీవల ఢిల్లీ నుంచి వచ్చిన ఓ మంత్రి రేషన్‌షాపుల వద్దకు వెళ్లి ప్రధాని ఫొటో పెట్టాలని ఆదేశించారని, అదే ఫొటోను పెంచిన గ్యాస్ సిలిండర్లపై కూడా పెట్టాలని సూచించారు.కార్నర్ సమావేశాల పేరిట మీ ప్రాంతాలకు వస్తున్న బీజేపీ నాయకులను మోదీ గ్యాస్,నిత్యావసర ధరలు ఎందుకు పెంచుతున్నారని నిలదీయాలన్నారు. కమలం పువ్వుకు ఓటేస్తే మళ్లీ కట్టెలపొయ్యే వస్తుందని, ప్రజలంతా ఆలోచించాలన్నారు. అబద్ధాలతో పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వ పతనం వంటింటి నుంచే మొదలైందని,రానున్న ఎన్నికల్లో మహిళలు తమ శక్తిని ఓటు ద్వారా చూపించాలని మంత్రి పిలుపునిచ్చారు. సాలు మోదీ.. సంపకు మోదీ..అంటూ ర్యాలీలో మహిళలు, బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, కార్పొరేటర్లు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు

టెన్త్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

- ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- అధికారులతో అదనపు కలెక్టర్ తిరుపతిరావు సమీక్ష

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పదో తరగతి పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ తిరుపతిరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 3 నుంచి 13 వరకు నిర్వహించనున్న వార్షిక పరీక్షలకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 49,574 మంది పరీక్షకు హాజరుకానున్నారని, ఇందుకు 226 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మరో 729 మంది సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ప్రకటించారు. ప్రశ్నాపత్రాల స్టోరేజీ కోసం జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, అస్వస్థతకు గురైన వారికి తక్షణమే వైద్య సేవలు అందించేందుకు స్టాఫ్‌నర్సును అందుబాటులో ఉంచాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతో పాటు మందులు సిద్ధం చేయాలని సూచించారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయాలకు ఆస్కారం లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా విద్యాశాఖ అధికారులు, పోలీసులు, పోస్టల్, రెవెన్యూ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పించండి

- బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి



ఎంఈఓ కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి నిరుపేద విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. సరూర్‌నగర్ మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయంగా మారిపోయాయని.. మౌలిక వసతుల లేమి.. విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడం.. సరైన తరగతులు లేకపోవడం వంటి సమస్యలు పట్టి పీడిస్తున్నాయని అన్నారు. ఒక్కో తరగతి గదిలో పరిమితికి మించి విద్యార్థులను కూర్చోబెట్టడం ద్వారా విద్యార్థులు పాఠశాలకు రావాలంటేనే అయిష్టత చూపే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. టాయిలెట్లు లేకపోవడం.. ఉన్నా అపరిశుభ్రంగా ఉండడం.. స్వీపర్లు లేక చెత్తా చెదారంతో పాఠశాలలు మురికి కూపాలుగా మారుతున్నాయని అన్నారు. ఇటీవల విద్యార్థినులు టాయిలెట్లకు వెళ్లకుండా ఉండేందుకు ట్యాబ్లెట్లు వేసుకుని వస్తున్న ఘటనలు వెలుగు చూశాయని గుర్తు చేశారు. ఈ పరిస్థితులన్నీ విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం ఎంఈఓ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కళ్లెం ప్రకాశ్, నవజీవన్‌రెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, కృష్ణవేణి, అంజన్‌కుమార్ గౌడ్, జయప్రకాశ్, నూతి శ్రీనివాస్, రామేశ్వర్, రవిశంకర్, కృష్ణంరాజు, కవితారెడ్డి, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కొంగరకలాన్.. ఖ్యాతి పెరిగెన్

ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్ సిగలో మరో కలికితురాయి చేరనుంది. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించగా తాజాగా కలెక్టరేట్ పక్కనే అంతర్జాతీయ దిగ్గజం ఆపిల్ కంపెనీ అనుబంధ సమూహ ఫాక్స్‌కాన్ రాబోతోంది. రాష్ట్రంలో ఫాక్స్‌కాన్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఆదిబట్లలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్, టాటా లాకిడ్ మార్టిన్, టాటా బోయింగ్, టాటా సికోర్‌స్కీతోపాటు ఔటర్ రింగ్‌రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉన్నాయి. మరో కంపెనీ రానుండడంతో కొంగరకలాన్ పేరు మరోసారి అంతర్జాతీయ స్థాయిలో వినిపించనుంది.

196 ఎకరాల స్థలం కేటాయింపు..

కలెక్టరేట్‌కు ఎదురుగా సర్వే నంబర్ 300లోని 196 ఎకరాల విస్తీర్ణంలో ఫాక్స్‌కాన్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ కంపెనీ ఏర్పాటుతో కొంగరకలాన్ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఇప్పటికే ఫాక్స్‌కాన్ సంస్థ చైర్మన్ యంగ్‌లూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. తైవానెస్ ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ తయారీ దిగ్గజం తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కంపెనీలు నెలకొల్పనుంది. ఈ మేరకు మొదటగా తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి అగ్రిమెంట్లు చేసుకున్నారు.

రూ.3,500 కోట్ల పెట్టుబడులు..

కొంగరకలాన్‌లో ఏర్పాటు కాబోతున్న ఫాక్స్‌కాన్ కంపెనీకి రూ.3,500 కోట్ల పెట్టుబడి పెట్టడానికి సంస్థ చైర్మన్ యంగ్‌లూ ముందుకొచ్చారు. ఇప్పటికే కలెక్టరేట్ రాకతో కొంగరకలాన్, ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని భూములకు రెక్కలొచ్చాయి. ఈ కంపెనీ రాకతో మరింతగా పెరిగే అవకాశం ఉంది. మరోవైపు స్థానికంగా మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.




కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ కంపెనీ చైర్మన్ యంగ్‌లూతో చర్చిస్తున్న జయేష్ రంజన్

భూముల పరిశీలన

తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ కంపెనీ చైర్మన్ యంగ్‌లూతో పాటు బృందం సభ్యులు గురువారం కొంగరకలాన్‌లోని సర్వే నంబర్ 300లో పర్యటించారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య కంపెనీ ఏర్పాటు చేయనున్న భూమిని పరిశీలించారు. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ వెంట ఉండి వారికి కంపెనీ ఏర్పాటుకు అవసరమయ్యే మౌలిక సదుపాయలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పెట్టుబడులకు తెలంగాణ అనువైన చోటని పేర్కొన్నారు. అనంతరం వారు టీఎస్‌ఐఐసీ అధికారులతో మాట్లాడి భూముల వివరాలు సేకరించారు.

స్వాగతిస్తున్నాం



కొత్త పరిశ్రమల ఏర్పాటును స్వాగతిస్తున్నాం. ఇలాంటి పరిశ్రమలతో మహిళలకు భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కొంగరకలాన్‌తో పాటు ఇబ్రహీంపట్నం వరకు శరవేగంగా అభివృద్ధి జరుగుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్‌కి రుణపడి ఉన్నాం. విజన్ ఉన్న నాయకుడు కేటీఆర్ నాయకత్వంలో ఇంత పెద్ద కంపెనీ రావడం చాలా సంతోషంగా ఉంది.

– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

సాత్విక్ మరణం కలచివేసింది

- కుటుంబ సభ్యులకు ఫోన్‌లో బండి సంజయ్ పరామర్శ



బండి సంజయ్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న సాత్విక్ తల్లిదండ్రులు

షాద్‌నగర్: శ్రీచైతన్య విద్యార్థి సాత్విక్ మరణం తమను ఎంతో కలచి వేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. షాద్‌నగర్‌లో నివాసం ఉంటున్న సాత్విక్ కుటుంబ సభ్యులను గురువారం ఆయన ఫోన్‌లో పరామర్శించారు. చేతికొచ్చిన కొడుకు ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. తమ కుమారుడిని అన్యాయంగా పొట్టన పెట్టుకున్న శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకునేలా కృషి చేయాలని సాత్విక్ తల్లిదండ్రులు కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే కార్పొరేట్ కళాశాలలు రెచ్చిపోతున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. ఈ విద్యా సంస్థల వెనుక ఉన్న పెద్ద మనుషుల భరతం పడుతామని, ర్యాంకుల కోసం విద్యార్థులను వేధింపులకు పాల్పడటం సరికాదన్నారు. అవసరమైతే సాత్విక్ కేసుకు సంబంధించి బీజేపీ లీగల్ సెల్ న్యాయసహాయం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తోందని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ అన్నారు. సాత్విక్ కుటుంబ సభ్యులను గురువారం సాయంత్రం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కళాశాల యాజమాన్యం వేధింపులు భరించలేకే సాత్విక్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. విద్యార్థిని వేధింపులకు గురి చేసి ఆత్మహత్యకు కారకులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అతని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కన్వీనర్ దినేష్ సాగర్ ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

మంచాల: ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి ప్లీనరీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడా పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, పేదల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. విద్యా వ్యవస్థలో నూతన చట్టాలను తీసుకొచ్చి సామాన్యుడికి విద్యను అందని ద్రాక్షగా మార్చేసిందని దుయ్యబట్టారు. నూతన శాస్త్రీయ విద్యావిధానాన్ని అమలు చేయకుండా విద్యా వ్యవస్థలో మనువాదాన్ని చేర్చాలని కుట్రలు చేస్తోందన్నారు. సామాన్యులకు న్యాయం అందని ద్రాక్షలా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు పర్చలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 15 నుంచి రాష్ట్రంలో సీపీఎం బస్సు యాత్ర నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. గ్రామగ్రామాన తిరిగి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్య పర్చుతామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్సు యాత్రకు స్వాగతం పలికి ప్రజా పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య, సామేల్, మధుసూదన్‌రెడ్డి, చంద్రమోహన్, శోభన్, రాజు, జగదీశ్, కవిత, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, అంజయ్య, రవికుమార్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

అత్యాశకు పోతే అసలుకే ఎసరు

- రూ.లక్ష డిపాజిట్ చేస్తే మూడేళ్లు నెలకు రూ.9 వేలు జమ చేస్తామని ప్రకటన
- అధిక వడ్డీ ఆశతో జిల్లాలో రూ.35 కోట్లకు పైగా డిపాజిట్
- మోసపోయామని గుర్తించి పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు సైతం..



సీఐ లింగయ్యకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

యాచారం: ఆన్‌లైన్ మార్కెటింగ్ వలలో చిక్కుకొని బాధితులు విలవిల్లాడుతున్నారు. అధిక వడ్డీ వస్తుందని అత్యాశకు పోయి నిండా మునిగారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉండటం గమనార్హం. రూ.35 కోట్లకు పైగా మోసపోయామని 50 మంది బాధితులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. ఢిల్లీ కేంద్రంగా ఈ–స్టార్ ఇండియా, కేపీడబ్ల్యూ కంపెనీ అనే ప్రైవేట్ వ్యాపార సంస్థలు ఆన్‌లైన్ మార్కెటింగ్ నిర్వహిస్తున్నాయి. రూ.లక్ష డిపాజిట్ చేస్తే నెలకు రూ.9 వేల చొప్పున 36 నెలల పాటు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించాయి. అసలు రూ.లక్షతో పాటు అదనంగా రూ.2,24,000 వస్తాయన్న మాట. రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఈ సంస్థలు మొదట రూ.లక్ష డిపాజిట్ చేసిన వారికి ఆరు నెలల పాటు నెలకు రూ.9 వేల చొప్పున జమ చేసి నమ్మబలికాయి. దీంతో అత్యాశకు పోయి జనం ఎగబడ్డారు. ఢిల్లీ కేంద్రంగా జరిగే ఈ వ్యవహారాలను యాచారం గ్రామానికి చెందిన ఎండీ సోఫియాన్, ఎండీ ఉస్మాన్, ఎండీ ఫర్హాన్, మహేశ్వరం గ్రామానికి చెందిన ఎండీ సమద్, మొగిలిగిద్దకు చెందిన ఎండీ యూసుఫ్, హైదరాబాద్‌కు చెందిన ఎండీ అజహర్ పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని యాచారం, కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన వందలాది మంది జనం వీరి మాటలను నమ్మి ఈ రెండు సంస్థల ఖాతాల్లో లక్షలాది రూపాయలు డిపాజిట్ చేశారు. అప్పులు చేసి, బంగారు నగలు తాకట్టు పెట్టి, బ్యాంకు రుణాలు తెచ్చి, పిల్లల పెళ్లిళ్ల కోసం దాచి పెట్టిన డబ్బులన్నీ ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో పెట్టారు. ఏడు నెలల నుంచి వీరి ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. చివరకు తాము మోసపోయామని తెలుసుకొని బాధితులు లబోదిబోమంటున్నారు.

బాధితుల్లో ఉద్యోగులు సైతం

అధిక వడ్డీ ఆశతో పలు శాఖల ఉద్యోగులు సైతం ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో పెట్టుబడులు పెట్టారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్టీసీ ఉద్యోగులు వందలాది మంది లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టారు. కొందరైతే ఏకంగా రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు చెల్లించినట్లు తెలిసింది. కాగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగయ్య తెలిపారు.

సార్.. మీరే ఆదుకోండి

ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో డబ్బులు జమ చేసి మోసపోయిన బాధితులు గురువారం యాచారం పోలీసులను ఆశ్రయించారు. దాదాపు 50 మందికి పైగా బాధితులు తాము ఆన్‌లైన్‌లో చెల్లించిన డిపాజిట్ పత్రాలను సీఐ లింగయ్యకు చూపించారు. ఒక్క యాచారం మండలంలోనే పది కోట్ల రూపాయలకు పైగా డిపాజిట్ చేసినట్లు తెలుస్తోంది. పిల్లల పెళ్లిళ్లకు అవసరం వస్తాయనే ఆశతో రూ.లక్షలు జమ చేశామని, మీరు ఆదుకోకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యం అంటూ వారు కన్నీళ్ల పర్యంతమయ్యారు.

తెలుగు రాష్ట్రాల్లో మాదే అధికారం



ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా బండి సంజయ్‌కి స్వీటు తినిపిస్తున్న నేతలు

- బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ధీమా
- ఈశాన్యంలో విజయంపై సంబరాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఈశాన్య రాష్ట్రాల ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వానికే మళ్లీ పట్టం కట్టారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్‌లో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో బీజేపీకి అనుకూలంగా ఫలితాలొచ్చాయని, మోదీ పాలనను మెచ్చి జనం ఆదరించారని పేర్కొన్నారు. దేశమంతా నరేంద్రమోదీ హవా కొనసాగుతోందని చెప్పారు. బీజేపీకి ఈశాన్య రాష్ట్రాలు అండగా నిలిచాయని తెలిపారు. ఇక కమ్యూనిస్టుల పని అయిపోయిందని చెప్పారు. గల్లీ, ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగైందని, త్వరలో జరిగే ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో కాషాయం జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందన్నారు. తెలంగాణ రాక ముందు మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను కుటుంబ పాలనలో అప్పుల తెలంగాణగా మార్చేశారని మండిపడ్డారు. కాగా, ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ గెలుపొందిన సందర్భంగా ఆదిబట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్‌లో విజయోత్సవ సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే రూ.500కే సిలిండర్

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి హామీ
- ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన



కడ్తాల్: ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. కేంద్రం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలకు నిరసనగా గురువారం మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వంటగ్యాస్ సిలిండర్ రూ.500కే అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల నడ్డి విరుస్తున్నాయని పేర్కొన్నారు. నిత్యావసర ధరలతో పాటు వంట గ్యాస్ ధరలు పెరగడంతో పేద ప్రజలు అల్లాడుతున్నారని చెప్పారు. దేశ ప్రజలను ఇబ్బందులు పెడుతున్న బీజేపీని ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల పేదలు మరింత పేదరికంలోనే మగ్గుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే బీజేపీకి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతూ, ప్రజలపై మోయలేని భారం వేయడం అన్యాయమని మండిపడ్డారు. ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని కోరారు. కేంద్రంలో తుగ్లక్ పాలన, రాష్ట్రంలో నిజాం పాలన సాగుతోందని ఆయన ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, నాయకులు మల్లేశ్‌గౌడ్, లక్ష్మయ్య, బీచ్యానాయక్, రాజేశ్, యాదయ్యగౌడ్, హీరాసింగ్, అజ్గర్‌అలీ, తులసీరాం, రవి, రాజేందర్, రంగా, శ్రీశైలం, మహేశ్, శ్రీకాంత్, నరేశ్, శివ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పాలనకు చరమగీతం: వంశీచంద్



తలకొండపల్లి ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి: రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడుదామని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని పడకల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న బీఆర్ఎస్ నేతలు ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో అరాచక పాలన కొనసాగుతోందని, ఈ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, పీసీసీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్య గుప్తా, సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జి అజీం, సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసామూర్తి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, కృష్ణయ్య, ఆరిఫ్, తిరుపతి, ప్రవీణ్, మురళి, వినోదు, అభిషేక్, వెంకటయ్య, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

ఈదులపల్లిలో దొంగల హల్‌చల్

- రెండు ఆలయాల్లో చోరీ
- ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన దొంగలు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ రామయ్య

నందిగామ: మండల పరిధిలోని ఈదులపల్లిలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయం, శివాలయంతో పాటు ఓ ఫాంహౌస్‌లో దొంగతనానికి పాల్పడి విలువైన ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. ఇన్‌స్పెక్టర్ రామయ్య కథనం ప్రకారం.. గ్రామ సమీపంలో ఉన్న శివాలయం, గ్రామంలో ఉన్న హనుమాన్ దేవాలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. శివాలయం గుడి తాళం పగులగొట్టి అమ్మవారి పుస్తెలు, కాలిమెట్టెలు, హుండీలోని నగదును అపహరించారు. అలాగే.. హనుమాన్ దేవాలయంలో హుండీని ఎత్తుకెళ్లి అందులోని నగదును తీసుకొని సమీపంలోని జామ తోటలో ఖాళీ హుండీని పడేసి వెళ్లినట్లు రామయ్య తెలిపారు. వీటితో పాటు గ్రామ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో కూడా చోరీ జరిగింది. ఈ ఘటనలలో రూ.30 వేల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదును ఎత్తుకెళ్లిపోయినట్లు గ్రామస్తుడు శ్రావణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



హరి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం జర్పలతండా ముదిగొంగ గ్రామానికి చెందిన హరి(45)ని గత నెల 28న దేవరకొండకు పంపడానికి వాహనం ఎక్కించారు. తుర్కయంజాల్ కట్ట మీద మళ్లీ దేవరకొండకు చేరుకున్నాడు. అదే రోజు హరిని మళ్లీ ఆర్టీసీ బస్సు ఎక్కించారు. ఇంటికి చేరుకోలేదు. ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి తిరుకల్యాణ మహోత్సవాలు

- నాలుగు రోజుల పాటు వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఉత్సవ కమిటీ



సహజసిద్ధమైన బాలాజీ స్వామి ఆలయం



గృహలో వెలసిన స్వామి అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని మంఖాల్ గ్రామం శ్రీనగర్‌లో కొలువుదీరిన ఆదిలక్ష్మి అలివేలు మంగ సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం తిరు కల్యాణ మహోత్సవానికి సిద్ధమైంది. ప్రతి ఏటా ఫల్గుణ మాసంలో ఏకాదశి నుంచి చతుర్దశి వరకు నాలుగు రోజుల పాటు తిరు కల్యాణ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. ఇందు కోసం ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

సహజ సిద్ధమైన ఆలయం

రాష్ట్రంలోనే అతి పెద్ద స్వయంభూ ఆలయాల్లో ఇది ఒక్కటి. ఈ ఆలయం సహజ సిద్ధమైంది. కొండల మధ్య ఉంటుంది. ఆలయ పరిసరాల్లో కోనేరు ఉంది. ఎంత కరువు వచ్చినా అందులో నీరు ఎండిపోదు. కోనేటి నీరు తియ్యగా ఉంటాయి. స్వామి వారికి నిర్వహించే తిరుకల్యాణంలో ఈ నీటితోనే అభిషేకాలు చేస్తారు. రాత్రి వేళ మాత్రమే కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. కల్యాణం జరిపించే సమయంలో అలివేలు మంగ సమేత బాలజీ స్వామి.. వేదపండితులు మాత్రమే ఉంటారు. కల్యాణం మరుసటి రోజు రథోత్సవం నిర్వహిస్తారు. అతి పురాతన రథం కావడంతో దాన్ని కదలించడానికి కనీసం రెండు వందల మంది భక్తులు అవసరం అవుతారు.

ఉత్సవాల నిర్వహణ ఇలా..

ఈ నెల 3వ తేదీ ఉత్సవమూర్తులకు అలంకరణ, అభిషేకం, అర్చన, శేష వాహనంపై ఊరేగింపు, గ్రామ ఆలయం నుంచి గుట్టపైకి స్వామి, అమ్మవార్లను తీసుకరావడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 4న మూలవరలకు అభిషేకం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనం, రక్షాబంధనం, అంకురార్పణ, స్వామి వారి ఎదుర్కోలు, రాత్రి 8గంటలకు తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 5న విష్ణు సహస్ర నామ సోత్ర పారాయణం, విశేష అర్చనలు. లక్ష్మీ నారసింహ సుదర్శన వాహనం, రాత్రి 9 గంటలకు రథోత్సవం ఉంటుంది. 6న ఫ్యాబ్‌సిటీ బాలజీ స్వామి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను మంఖాల్ గ్రామంలోని ఆలయానికి ఊరేగింపుగా తీసుకపోవడంతో ఉత్సవాలు ముగిస్తాయి.

హైనా దాడిలో లేగదూడ మృతి

ఆమనగల్లు: కడ్తాల మండల కేంద్రం సమీపంలోని వ్యవసాయ క్షేత్రం వద్ద బుధవారం రాత్రి హైనా దాడిచేసి లేగదూడను చంపింది. కడ్తాల్‌కు చెందిన ఇప్పల కృష్ణయ్య గురువారం ఉదయం తన వ్యవసాయ పొలంలోని పశువుల పాక వద్దకు చేరుకోగా ఒక లేగదూడ చనిపోయి ఉండటాన్ని గుర్తించాడు. వెంటనే సమాచారం అందుకున్న కడ్తాల సర్పంచ్ గూడురి లక్ష్మీనర్సింహారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు తెలియజేయడంతో బీట్ ఆఫీసర్ విజయభాస్కర్ రెడ్డి, పశువైద్యాధికారి డా.భానునాయక్ వచ్చి పరిశీలించారు. లేగదూడ హైనా దాడిలో మృతి చెందినట్లు గుర్తించారు.

శుభపరిణామం

జిల్లాలో ఫాక్స్‌కాన్ సంస్థ ఏర్పాటుపై మంత్రి సబిత హర్షం



సీఎం కేసీఆర్, ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్‌ల్యూకి ధన్యవాదాలు తెలియజేస్తున్న మంత్రి సబిత

మహేశ్వరం: అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు ఉన్న ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల సంస్థ ఫాక్స్‌కాన్ తెలంగాణలో భారీ పెట్టుబడులకు ఒప్పందం చేసుకోవడం శుభ పరిణామం అని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజల తరపున ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అంతర్జాతీయంగా అనేక దేశాల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రంగం ముఖచిత్రాన్ని గుణాత్మకంగా మార్చిన గొప్ప సంస్థ ఫాక్స్‌కాన్ అని, తమ ఉత్పత్తి కార్యకలాపాలను రంగారెడ్డి జిల్లాలో చేపట్టనుండటం గర్వకారణమన్నారు. గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్, ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్‌ల్యూకి సమక్షంలో ఒప్పందం జరగడం జిల్లా చరిత్రలో నిలిచిపోయే రోజని పేర్కొన్నారు. తెలంగాణ స్వరాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించి భారీగా పెట్టుబడులను రప్పించడంలో మంత్రి కేటీఆర్ చొరవ ఎంతో గొప్పదని మంత్రి కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?




విద్యార్థి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్

- ర్యాంకుల పేరిట వేధింపులు తగదు
- పీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్
- సాత్విక్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

షాద్‌నగర్: కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటం తగదని పీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని పద్మావతీ కాలనీలో నివాసం ఉంటున్న విద్యార్థి సాత్విక్ కుటుంబ సభ్యులను గురువారం కాంగ్రెస్ పార్టీ నేతలు పరామర్శించారు. విద్యార్థి తల్లిదండ్రులు నాగుల రాజు, అలివేలుతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శంకర్ విలేకరులతో మాట్లాడుతూ... కార్పొరేట్ విద్యా సంస్థల చేతుల్లో ప్రభుత్వం కీలుబొమ్మగా మారిందని ధ్వజమెత్తారు. ర్యాంకుల పేరుతో విద్యార్థులను చిత్రహింసలకు గురిచేసి వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చదువుల్లో ఎంతో చురుగ్గా ఉండే సాత్విక్.. శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని, సాత్విక్ మృతి ఘటనకు సంబంధించిన కేసు విషయంలో ఎలాంటి న్యాయ సహకారం అందించేందుకైనా తమ పార్టీ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. విద్యార్థి ఆత్మహత్యకు కారకులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని, కళాశాల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో కార్పొరేట్ విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, కొమ్ము కృష్ణ, సయ్యద్ ఖదీర్, సుదర్శన్, అందె శ్రీకాంత్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలకు సకల సౌకర్యాలు

- మంత్రి సబితారెడ్డి
- పహాడీ దర్గాను సందర్శన



బాబా షర్ఫొద్దీన్ దర్గాలో పూలు సమర్పిస్తున్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్‌లోని చారిత్రాత్మకమైన బాబా షర్ఫొద్దీన్ దర్గాను గురువారం విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి దర్శించుకున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి దర్గా ఉర్సు ఉత్సవాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపాలిటీ అధికారులతో కలిసి దర్గాలో ఏర్పాట్లను పరిశీలించారు. స్వయంగా 360 మెట్లు ఎక్కిన మంత్రి.. బాబా సమాధిపై పూలు సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రాచీనమైన బాబా షర్ఫొద్దీన్ దర్గా 757 ఉర్సు ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. మంచినీరు, విద్యుత్ దీపాలతో పాటు పారిశుద్ధ్యంపై అధికారులు రౌండ్ ది క్లాక్ పనిచేసేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది, కమిషనర్ వసంత, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, సీనియర్ నాయకులు, ఖైసర్ బామ్, యూసుఫ్ పటేల్, కొండల్ యాదవ్, దస్తగిర్ పాల్గొన్నారు.